ప్రజాశక్తి
గురువారం 17 ఏప్రిల్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్ష



ప్రజాశక్తి-నెల్లూరు :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల మూడో శనివారం నిర్వహించిన "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించి, పర్యావరణ పరిరక్షణలో వారిని కూడా భాగస్వాములు చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ వై.ఓ. నందన్ సూచించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ.వి.ఆర్.ఎస్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ పనుల సంతృప్తి 70 శాతం కన్నా తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. దానిని మెరుగుపరిచేందుకు అందరూ కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్,ఈ.ఈ. రహంతు జానీ,పొల్యూషన్ ఎన్విరాన్మెంటల్ ఈ.ఈ. అశోక్ కుమార్, హోమ్ ల్యాండ్ ఏజెన్సీ సుమన్, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

‘అభివృద్ధి’ జోరు..‘సంక్షేమం’ జీరో..!

సూపర్ సిక్స్‌పై ప్రజలు ఆరా ◆ అభివృద్ధిలో స్వకార్యం..స్వామి కార్యం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

అభివృద్ధి...సంక్షేమం ప్రభుత్వాలకు రెండు కళ్లు.. వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించి, అభివృద్ధి మూలన పడేసింది..టిడిపి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు జోరు పెంచింది..ఇదే సమయంలో సంక్షేమ కార్యక్రమాలు జీరోగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తుంది. ఇలాంటి సమయంలో ప్రజలు ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఆరా తీస్తున్నారు.. గల్లాపెట్టె ఖాళీగా ఉందని చెబుతున్నా ఎన్నికల సమయంలో తెలియదా ? అంటూ ప్రశ్నిస్తున్నారు. నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, ఏసి బస్టాండ్లు, సెంటర్ లైటింగ్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. తమ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు, ప్రజలకు ఉపయోగకరంగా కనిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద రోడ్ల నిర్మాణం సాగు తోంది.. కూటమి ప్రభుత్వంలో కొందరు ఒకే అంటుండగా, మరికొందరు పెదవి విరుస్తున్నారు..

నూతన కూటమి ప్రభుత్వం అభివృద్ధి విషయంలో కొంత జోరుగా కనిపిస్తున్నా సంక్షేమం విషయంలో వెనుకపడిందనే ఆరోపణలు ఎదు ర్కొంటుంది. వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు పంపిణీ చేసి, రోడ్లు, డ్రైనేజీ, మౌలిక సదు పాయాల విషయంలో నిర్లక్ష్యం చేసింది. అభివృద్ధి, సంక్షేమాన్ని సమతుల్యం చేయలేక పోయింది. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను కూడగట్టుకుంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అనేక హామీలు కురి పించింది. వచ్చిన వెంటనే అమలు చేస్తామని హామీ ఇచ్చింది. డిఎస్సి 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. వలంటీర్లకు రూ.10 వేలు, పెన్షన్ పెంపు, ప్రతి మహిళకు నెలకి రూ.1500, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు నెలకి రూ.3 వేలు, తల్లికి వందనం, ఒక్కో బిడ్డకు రూ.15 వేలు, మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితం, ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల, మెగా డిఎస్సి, 20 లక్షల ఉద్యోగాలు, ఇలా అనేక హామీలిచ్చారు.

పింఛన్లు, ఉచిత గ్యాస్ అమలు చేస్తున్నారు. మిగిలిన వాటిని దశల వారీగా చేస్తామని చెబుతున్నా ప్రజలు నమ్మడం లేదు. ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలు మరిచిపో యారనే విమర్శలు సాధారణ జనం నుంచి కూటమి ప్రభుత్వానికి వస్తు న్నాయి. గ్రామీణ ప్రాంతాలు, పేదలు నివసించే వాడల్లో ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్నారు. వైసిపి, టిడిపి ప్రభుత్వాల తీరు తెన్నులు చర్చకు పెడుతున్నారు. ఉచిత ఇసుక అందిస్తున్నా అధికారపార్టీ నేతలు అక్రమాలకు ఉపయోగకరంగా మారిందనే విమర్శలు న్నాయి. మద్యం ఏ ా ల స ీ తీ స ం కొ చ్చి నా అధికారపార్టీ నేతలే ఎక్కువ మంది వీటిని దక్కించుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. మైనింగ్‌లో అక్రమాలు కారణంగా వ్యాపారులు భారీగా నష్టపోయారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమతుల్యం చేయలేకపోతుందనే విమర్శలు ఎదుర్కొంటుంది. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గల్లాపెట్టె ఖాళీగా ఉందని చెబుతున్నా జనం పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఈ విషయం తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. ఇది జగన్ కొనసాగించిన కూటమి ప్రభుత్వంపై మరింత వ్యతిరేకత కనిపించేలా ఉంది..

నెల్లూరులో "అభివృద్ధి" జోరు..!

ఎన్‌టిఆర్ పార్కులో ప్రజల కోలాహలం

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు సాగుతు న్నాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి రోడ్లు, డ్రైనేజీ, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరగలేదంటే అతిశయోక్తి కాదు. పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. అన్నమయ్య సర్కిల్ వద్ద గత ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం చేసిన ఎన్‌టిఆర్ పార్కులను అభివృద్ధి పరచి అక్కడ ప్రజలకు ఉపయోగంలోకి తీసుకొచ్చారు. ఏసి బస్టాండ్‌లు పేరుతో 2019లో టిడిపి ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లను కుక్కలకు ఆశ్రమాలుగా చేశారు. నేడు వాటిని అభివృద్ధి పరిచి అందుబాటులోకి తీసుకొచ్చారు. నగరంలో మంత్రి పి. నారాయణ తమ నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున రోడ్లు, డ్రైనేజీ, పార్కు ఆధునికీకరణ వంటి కార్యక్రమాలు వేగంగా చేస్తున్నారు. సర్వేపల్లె, కోవూరు, కావలి, ఉదయగిరి వంటి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం సాగుతోంది. ఉపాధి పథకం కింద వీటిని చేపడుతున్నారు. ఇక్కడ స్వ కార్యం, స్వామి కార్యం అన్నట్లు సాగుతోంది. గత ఎన్నికల్లో తమ విజయం కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఈ పనులు మొత్తం అప్పగించి చేస్తున్నారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి పెద్ద పీటవేస్తున్నారు. కార్యక్రమాల ద్వారా గత ప్రభుత్వానికి నేటి ప్రభుత్వానికి ప్రజలు తేడాను గుర్తిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో జోరు కనిపిస్తున్నా, సంక్షేమం విషయంలో వెనుకపడిపోయిందని లెక్కలు చెబుతున్నాయి.

నగరంలో సిద్ధమైన ఎసి బస్టాండ్

కమిషనర్ సూర్యతేజ బదిలీ

ప్రజాశక్తి-నెల్లూరు

నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఈ మేరకు నగర పాలక సంస్థ కార్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తికాక ముందే ఈ బదిలీ చోటు చేసుకోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-కందుకూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య భివద్ధి సంస్థ , కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వారిచే ఏర్పడిన స్కిల్ హబ్ సెంటర్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ,ఇంజనీరింగ్ చేసిన విద్యార్థులకు మూడు నెలలు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీ నుంచి కొత్తగా బ్యాచ్‌లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. .వివ రాలకు:-9848050543, 9381455688 నెంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపల్ రియాజుద్దీన్ తెలిపారు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా విప్పిగుంట రోడ్డులోని శ్రీ గణేష్ అపార్ట్మెంట్స్ లో డెమో కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి బి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్ వాసులకు సాధారణంగా నివాసంలలో జరిగే అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ చర్యలను గురించి వివరించారు. అనంతరం పామూరు రోడ్డు సెంటర్ లో ప్రజలకు కరపత్రములను పంపిణీ చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరులో గత వారం రోజులుగా వరుసగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో విద్యుత్ వినియోగదారులు అవస్థలు పడుతున్నారు వాతా వరణంలో వచ్చిన మార్పుల వల్ల చిరుగాలులు తగలగానే విద్యుత్ తీగలు తెగిపడటం వల్ల ఈ సమస్య తలెత్తుతోంది. విద్యుత్ సరఫరా ఆగిపోయిన కొన్ని గంటల తర్వాత కూడా పునర్ధించకపోవడం వల్ల విని యోగదారులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం ఐదు గంటలకి సరఫరా ఆగిపోతే 10.30 గంటల తర్వాత పునరుద్ధరించారు. ఇప్పటికైనా విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని విని యోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

ప్రజాశక్తి-నెల్లూరు :కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే డిఎస్‌సి నోటిఫికేషన్ ఫైల్‌పై మొదటి సంతకం ఎనిమిది నెలలు పూర్తికావస్తున్నా నేటి వరకు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దారుణమని, తక్షణమే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని విఆర్‌సి సెంటర్‌లో నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళన కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో భాగంగా పోలీసులకు, డివైఎఫ్ఐ కార్యకర్తలకు మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం రాష్ట్రంలో నిరుద్యోగ అభ్యర్థులు ఏడేళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు.గత ప్రభుత్వం ఐదేళ్లలో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం డిఎస్‌సి అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తుందన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులుకు ఇచ్చిన హామీ అమలు కోసం చర్యలు చేపట్టాలని తక్షణమే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.వి రమణ జిల్లా అధ్యక్షుడు బి.పి నరసింహ రూరల్ కన్వీనర్ జి.చైతన్య . జగదీష్.ఫయాజ్.శేఖర్ మహేష్. పవన్.వినోద్ కుమార్ నాయకులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులను లాక్కెళ్తున్న పోలీసులు

ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణంలోని టి ఆర్ ఆర్ గవర్న మెంట్ జూని యర్ కళాశాలలో ఇంటర్ చదువు తున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పాల్గొన్నారు. గత ప్రభుత్వాలు పాఠ్య పుస్తకాలను అందించడంలో నిర్లక్ష్యం వహించా యన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చదువుకునే పేదవారి పిల్లలు ఏ ఇబ్బందులూ లేకుండా చదువుకోవాలనే ఉద్దేశంతో ముందుకు పరిపాల సాగిస్తుందని తెలిపారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ దాతల సహకారంతో టి ఆర్ ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్మించిన బాస్కెట్ బాల్ కోర్టును ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారం భించారు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుని టి.ఆర్.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగూర్ వలి సత్కరించారు.బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఏర్పాటుకు సహకరించిన దాతలను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు కళాశాల ప్రిన్సిపాల్ నాగూర్ వలి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్ని రోశయ్య, కందుకూరు పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు ఉన్నారు.

మరమ్మతులకు నోచని చేతిపంపు

ప్రజాశక్తి -సైదాపురం :మండలంలోని కొమ్మిపాడు ఎస్టీ కాలనీలో కొద్దిరోజులుగా చేతి పంపు మరమ్మత్తులకు గురికావడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.మంచినీటికి ఇబ్బందులు తలెత్తితే అధికారులకు తెలిపిన పట్టించుకోవట్లేదని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో

ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు : అంబులెన్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ వద్ద ఉచిత అంబులెన్స్ సేవలను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సిఐటియు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, కె పెంచల నరసయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ అంబులెన్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) వైద్యం కోసం వచ్చే పేద ప్రజల కోసం లోకల్ పరిధిలో ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. అనంతరం అంబులెన్స్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అధ్యక్షులు కె సాయికుమార్ మాట్లాడుతూ గవర్నమెంట్ హాస్పటల్ వద్ద అంబులెన్స్ ఉచిత సేవలను ఉప యోగించుకోవచ్చన్నారు. దీనిని వైద్య సేవలకు వచ్చేటువంటి పేషెంట్స్ ఉప యోగించకోవాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు నాయకులు సతీష్ కుమార్, సంధా నీ భాష, సురేష్, ఎన్. మాల కొండయ్య, ఎస్. కె. ఖలీల్, సంపత్ అంబులెన్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు కే. సాయికుమార్, కె. విజయ్, శివ, ఎస్. కే. జిలాని ఉన్నారు.

అంబులెన్స్ సేవలను ప్రారంభిస్తున్న సిఐటియు నాయకులు

పార్కుల అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు :నగరపాలక సంస్థ పరిధిలో నిర్దేశించిన పార్కులన్నిటిని వేసవి సెలవులకు ముందుగానే అన్ని వసతులతో సిద్ధం చేసి, చిన్నారులకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్య తేజ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ మరియు బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎం.డి. శ్రీనివాసులు తో కలిసి స్థానిక కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఇంజనీరింగ్ అధికారులు, పార్కుల అభివద్ధి కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ లు రహంతు జానీ, రఘురామ్, ఏ.ఈ లు, పార్కుల అభివద్ధి కాంట్రాక్టర్లు ఉన్నారు.

క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని నారాయణ వైద్యకళాశాల క్రీడా మైదానంలో ఇంటర్ కాలేజి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను బుధవారం ప్రారంభమయ్యాయి. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీ ఇంటర్ కాలేజ్ క్రికెట్ ఫర్ మెన్ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గంటా రవితేజ హాజరయ్యారు. నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు పి. శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 38 మెడికల్ డెంటల్ కళాశాల విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. డాక్టరు ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీ స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డాక్టరు తిమ్మూర్తి మాట్లాడారు. నారాయణ డెంట్ కాలేజి ప్రిన్సిపాల్ డావ అజయ్ రెజినాల్డ్, నారాయణ వైద్య విద్యా సంస్థల ఓ.ఎస్.డి ఆర్. సాంబశివరావు, ఆపరేషన్స్ హెడ్ డి. రామారావు, క్యాంపస్ ఇన్చార్జి ఎ.మునిశంకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సెల్విబాబు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పట్టణ పరిధిలోని దివివారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతా సమేత కోదండరామస్వామి దేవస్థానంలో జరిగిన విగ్రహ ప్రతిష్ట,మహా కుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ మండపంలో ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం,తీర్థ ప్రసాదాలు అందజేశారు. దివివారిపాలెం ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు ఎమ్మెల్యేకి ఆత్మీయ స్వాగతం పలికి శాలువా ఘనంగా సన్మానించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య,పట్టణ టిడిపి మాజీ అద్యక్షడు పిడికిటి వెంకటేశ్వర్లు ఉన్నారు.

సీతారాముల కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని తిమ్మారెడ్డి పాలెంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం నుండి గ్రామంలోని కోదండ రామస్వామి దేవాలయం వద్ద కళ్యాణ ఏర్పాట్లు చేశారు. ఈ మహోత్సవాన్ని భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు..కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలోని విధుల్లో సీతారాముల రథోత్సవం నిర్వహించారు.



డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు

వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీని రైతులు అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వ్యవసాయంలో కిసాన్ డ్రోన్ల వినియోగం -ఉపయోగాలపై జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ అన్నదాతలకు వ్యయప్రయాసలు లేకుండా తక్కువ ఖర్చుతో మెరుగైన ఆదాయం పొందేందుకు అనేక నూతన శాస్త్ర, సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని రైతులందరూ ఈ డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. తొలుత డ్రోన్ కంపెనీల ప్రతినిధులు ప్రత్యక్షంగా డ్రోన్లను చూపించి,వాటి పనితీరు, బ్యాటరీల చార్జింగ్, సాంకేతిక పరిజ్ఞానం మొదల్కైన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివత్తి చేశారు. ఈ కార్యక్రమంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్, వ్యవసాయశాఖ ఎడిలు శేషగిరి, నర్సోజిరావు, టెక్నికల్ ఎవో మంజుల ఉన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పోటీలు

ప్రజాశక్తి - లింగసముద్రం

లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి 5వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను కాంప్లెక్స్ చైర్మన్ యు.మాధవరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. క్లస్టర్ పరిధిలోని 15 పాఠశాలల విద్యార్థులు 78 మంది ఇందులో పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లీషు,గణితం, సైన్సు, జనరల్ నాలెడ్జ్ అంశాలలో 60 మార్కులకు ప్రశ్నాపత్రాన్ని తయారుచేసి పరీక్షించారు.ప్రథమ,ద్వితీయ, తతియ స్థాయిలో నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. అక్కడ జరిగిన సభకు చైర్మన్ యు.మాధవరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి ఎమ్.వి.శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంఇఒ మాట్లాడుతూ వ్యక్తి వికాసానికి,సమాజ మార్పుకు పునాదులు ప్రభుత్వ పాఠశాలలేనన్నారు.క్లస్టర్ చైర్మన్ ఉమ్మడిశెట్టి మాధవరావు మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా క్లస్టర్ పరిధిలో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి టాలెంట్ టెస్ట్ ను నిర్వహించా మన్నారు ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు లింగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేరాలని సూచించాచరు. పాఠశాలలో అనేక సదుపాయాలు ఉన్నాయన్నారు. ఇంకా మొగిలిచర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆర్.ఆర్.పాలెం విద్యార్థిని సి.హెచ్.అనిత 43 మార్కులతో మొదటి బహుమతి సాధించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లింగసముద్రం విద్యార్థులు 42 మార్కులతో కె.కార్తికేయ,బి ప్రణవి విద్యార్థులు రెండో బహుమతి ని, టీ.లిఖిత మాధురి,డి.మనస్విని, బి.దీక్ష 41 మార్కులతో మూడో బహుమతిని పొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

‘మెడికవర్’లో ఆధునిక శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-నెల్లూరు : ఊపిరితిత్తులకు సంబంధించి ఐదేళ్ల వయస్సు కలిగిన ఓ చిన్నారికి మెడికవర్ వైద్యబృందం అత్యంత అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. బుధవారం నగరంలోని మెడికవర్ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను మీడియాకు పల్మనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి, పీడియాట్రిషియన్ డాక్టర్ ఉదయకీర్తి, అనస్థీషియన్ చీఫ్ డాక్టర్ రంగనాథ్‌లు వివరించారు. మాట్లాడలేని స్థితిలో ఉన్న కావలి పట్టణానికి చెందిన 5 ఏళ్ల సత్య అనే చిన్నారిని వారం రోజుల కిందట ఆ పాప తల్లిదండ్రులు మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లాం న్నారు. అప్పటికే కావలిలో తీయించుకున్న ఎక్స్‌రేను పరిశీలించగా ఎడమ ఊపిరితిత్తి నెమ్ముతో పూర్తిగా మూసుకుపోయినట్లు గుర్తించామన్నారు. అధునాతన వైద్యపరికరాలు, సీనియర్ డాక్టర్ల బందంతో కలిసి పరీక్షలు నిర్వహించి అనారోగ్యానికి గల అసలు కారణాన్ని గుర్తించి చికిత్స అందిం చామన్నారు. ఇలాంటి క్లిష్టమైన ఆపరేషన్లకు చెన్నై, హైదరాబాద్‌లాంటి మెట్రోపాలిటిన్ నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రిలకు వెళ్లాల్సిన పని లేదని మెడికవర్‌లో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.పాప తల్లిదండ్రులు పేదలు కావడంతో అతి తక్కువ ఖర్చుతో వైద్యసేవలందించామన్నారు. ప్రాణాలు కాపాడిన డాక్టర్లకు పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

పారిశుధ్య పనులు పర్యవేక్షణ

నెల్లూరు :నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన మార్గాల్లో అవసరమైనచోట సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటుచేసి పాదచారులు, వాహనదారులకు రాత్రి వేళల్లో అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు.పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 17వ డివిజన్ ఆకుతోట, యూకో నగర్ తదితర ప్రాంతాలలో కమిషనర్ బుధవారం పర్యటించారు.కార్పొరేటర్ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్ ఉన్నారు.

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు :బంగారు అంగడిలో నమ్మకంగా ఏడాది నుంచి పనిచేస్తూన్న షేక్ మన్సూర్ అనే వ్యక్తికి ఆ బంగారు దుకాణం యజమాని 130 గ్రాములు ప్యూర్ బంగారును కరిగించుకొని తీసు కురావాలని అందజేయగా, ఆ బంగారును తీసుకోని వెళ్లిపోయి తప్పించుకొని తిరుగ ుతుండగా సంతపేట పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతోపాటు 108 గ్రాముల బంగారు సొత్తును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సంతపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూరల్ డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కొరడా వీధి ప్రాంతంలోని బంగారు అంగడి యజమాని షేక్ ఖలీల్ తన వద్ద నమ్మకంగా పనిచేస్తున్న షేక్ మన్సూర్‌కు 130 గ్రాముల ప్యూర్ బంగారు కరిగించుకొని రావాలని అందజేయగా నాటి నుంచి కనపడకుండా పోయినట్లు మార్చి 8న స్టేషన్‌లో పిర్యాదు చేశారన్నారు. రూరల్ డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు, నగర డిఎస్‌పి పి.సింధుప్రియ పర్యవేక్షణలో సంతపేట పోలీసు స్టేషన్ సిఐ దశరథరామారావు, ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు, మల్లికార్జున, పిసిలు అల్లాభక్షు, వెంకటేశ్వర్లు, గోపి, శ్రీకాంత్‌లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు వేగవంతం చేశారన్నారు. ఈ క్రమంలో మంగళవారం సా యంత్రం రంగనాయకులపేట రైల్వే గేటు ప్రాంతంలో తిరుగుతున్న షేక్ మన్సూర్‌ను పోలీసులు అదుపులోకి తీసు కోవడంతోపాటు 108 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఎఐవైఎఫ్ జాతీయ మహాసభల

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు : తిరుపతి నగరంలో జరిగే 17వ ఎఐవైఎఫ్ జాతీయ మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి విజయ్. షేక్ మున్న మాట్లాడుతూ మే నెలలో 15 నుండి 18. వరకు జరగబోయే జాతీయ మహాసభలు జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు.నగర అధ్యక్షులు షేక్ గౌస్ బాషా షానవాజ్ కరిముల్లా వెంకటేశ్వర్లు నయాజ్ పాల్గొన్నారు

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-నెల్లూరు : ఏపి ఎన్ జి జి ఓస్ అసోసియేషన్ జిల్లా వారి ఆధ్వర్యములో నగరంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రను రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి రామకష్ణ అసోసియేట్ అధ్యక్షులు ఆంజనేయవర్మ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంచలయ్య కోశాధికారి ప్రసాద్ రెడ్డి రాష్ట్ర ల్యాబ్ టెక్నీషియన్ అధ్యక్షులు రఘు బాబు జిల్లా ఉపాధ్యక్షులు కరుణమ్మ కిరణ్ సంయుక్త కార్యదర్శులు రాజేంద్ర ప్రసాద్ విజయకుమార్ కష్ణకుమార్ చైర్‌ప ర్సన్ చిన్నమ్మ నవోదయ నగర అధ్యక్షులు రామకష్ణా రెడ్డి సురేష్ స్వర్ణలత ఉన్నారు

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అర్బన్ బి సెక్టార్ పరిదిలోని కేసరగుంట కాలనీ అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒకె సర్మిష్ట ప్రకాశం ఆదేశాల మేరకు బుధవారం పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహిం చారు. సూపర్వైజర్ ఎల్ లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు ఎం సుభాషిని, ఎస్ కె రహం తునిసా, బలిపల్లి పద్మావతి, ఏఎన్ఎం టి శాంతి ,ఆశా వర్కర్ ఎస్కే కర్రీ మున్నీసా ఉన్నారు.

కందుకూరులో..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు సెక్టార్ -2లోని మొగల్లూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం కార్యక్రమం బుధవారం నిర్వమించారు. గర్భిణులు, .బాలింతలకు పౌష్టికాహారం ఎలా తీసుకోవాలో వివరించారు. 18 ఏళ్లనిండిన తర్వాతే బాలికలకు వివాహాలు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కామేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు జి .భారతి. ఎల్. సంధ్యారాణి ఉన్నారు.

వాహనాల పార్కింగ్‌గా ప్రభుత్వ కార్యాలయాలు ..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : ప్రయివేటు వెహికల్స్ నిర్వాహకులు తహశీల్దార్ కార్యాలయాన్ని పార్కింగ్‌కు వాడుకుంటునా్రు. అధికారులు పట్టించు కోకపోవడంతో వారు యథేచ్ఛగా అక్కడే తమ వాహనాలను నిలుపుకుం టున్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వా ధికారుల వాహనాలు ఉండాలే గానీ.. ప్రైవేటు వ్యక్తుల వాహనాలు నిలపడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గుడ్లూరు తహసిల్దార్ జి .స్వర్ణ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తు న్నారు. మండల రెవెన్యూ అధికారి స్పందించి ప్రభుత్వ కార్యాల యాల్లో ప్రయివేటు వ్యక్తులు వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో నిలిపిన ప్రైవేటు వాహనం

వృద్ధురాలి ఆత్మహత్య

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరుకు చెందిన సాధినేని సుశీలమ్మ (70) మనస్థాపం చెంది స్థానిక లింగంగుంట దగ్గర నీటి కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు నీటి కుంటలో తేలియాడుతున్న వద్ధురాలి శవాన్ని కొందరు పశువులు కాపర్లు గమనించారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. కుటుంబ కలహాల కారణంగా తన దగ్గర ఉన్న బంగారాన్ని ఇంట్లో పెట్టి రెండు రోజుల కిందట అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన వద్ధురాలు నీటి కుంటలో శవమై తేలింది. వృద్ధురాలి ఆత్మహత్య ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-కావలి : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఏపి సచివాలయంలో కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన నాయకులు కలిశారు. వారికి ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అత్యంత పొడవైన సముద్ర తీరం వెంబడి ఉన్న రామాయపట్నం, తుమ్మలపెంట, మైపాడు, కొత్త కోడూరు, కృష్ణపట్నం, తూపిలి పాలెం, శ్రీనివాస సత్రం, బీచ్‌ల పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధికి అనువుగా ఉన్నాయని, ముఖ్యంగా చెన్నై నుండి విజయవాడ హైవేలో అతి దగ్గరగా ఉన్న సముద్ర తీరం కావలి నియోజకవర్గంలోని తుమ్మలపెంట బీచ్, పర్యాటక కేంద్రంగా బోట్ షికారికి, రిసార్ట్ ఏర్పాటు చేస్తే నెల్లూరు జిల్లా నుంచి ప్రభుత్వానికి ఆదాయవనరు అవుతుందని తెలిపారు. టెంపుల్ టూరిజం, పర్యాటకరంగా పరంగా నెల్లూరు జిల్లాని అభివృద్ధి చేయొచ్చని విన్నవించారు. సమావేశంలో నెల్లూరు టౌన్ ప్రెసిడెంట్ సుజయ్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్, సూళ్లూరుపేట ఇన్‌ఛార్జ్ ఉయ్యాల ప్రవీణ్ కుమార్, కోవూరు, సర్వేపల్లి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తలు చిప్పడి శ్రీనివాసులు రెడ్డి, బొబ్బేపల్లి సురేష్ నాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి నేతల చేరిక

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం 8వ వార్డుకు చెందిన వైసిపి నాయకులు మొగల్ రహీం బేగ్ (వైసిపి మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షులు), మొగల్ షమ్మా రహీం (మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్), షేక్ పీర్ మొహమ్మద్ (రూరల్ మండల మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షులు), షేక్ పీర్ జాని (మాజీ జిల్లా మహిళా కమిటీ నాయకురాలు) బుధవారం వైసిపి నుండి టిడిపిలో చేరారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ 9 నెలల పాలనలోనే ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి చాలా అభివృద్ధి పనులు చేశారని, ఇంటింటికీ ఎంఎల్ఎ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ చేరుకుంటూ సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తూ సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ఎంఎల్ఎ నాయకత్వంలో కావలి అభివృద్ధి చెందుతుందన్నారు.

వైసిపి హయాంలోనే కప్పరాళ్లగుంటగా మార్పు..

ప్రజాశక్తి-బిట్రగుంట : గత ప్రభుత్వంలో కప్పరాల తిప్పను కప్పరాళ్లగుంటగా మార్చింది వైసిపి నాయకులు కాదా అని టిడిపి మాజీ ఎంపిటిసి చింతపాటి వెంకటేశ్వర్లు బిజిరంగం సవాల్ విసిరారు. బుధవారం బిట్రగుంటలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపిటిసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒక రౌడీషీటర్, దొంగ పెయిడ్ విలేకరిని అడ్డం పెట్టుకొని అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని లేదంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అసలు కావలి నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియాకు ఆజ్యం పోసింది వైసిపినే కదా అని తెలిపారు. మాజీ ఎంఎల్ఎ గ్రావెల్ ధన దాహానికి దుమ్ము, ధూళి భరించలేక పోలీస్ స్టేషన్ తలుపులు మూసుకున్న సంగతి మరిచిపోయారా... అన్నారు. అంతేకాకుండా దుమ్ము ధూళికి ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తుండడంతో తెల్లవారుజామున వాటర్ ట్యాంకర్‌తో నీళ్లు చల్లింది ఎవరో ఒకసారి గుర్తు చేసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా అక్రమ కేసులు బనాయించి యాదవ సామాజిక వర్గానికి చెందిన రావి వినయ్ కుటుంబాన్ని అదేవిధంగా, ఎస్సీ కులానికి చెందిన పైడి హర్ష కుటుంబాన్ని ఏ విధంగా చిన్నాభిన్నం చేశావ్ మండల ప్రజానీకానికి తెలుసన్నారు. నాయకులు నాగరాజు, మాజీ ఎంపిటిసిలు అరుణ, ప్రభాకర్, గోచిపాతల సంజయ్, రాజేశ్వరి, సుభాని, వెంకట్రావు, మాకా, ఎస్ఎస్ యాదవ్, పుచ్చకాయల రమేష్, పోతల వినయ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-సీతారాంపురం : స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదురుగా పాత బస్టాండ్‌లో బుధవారం స్థానిక వెలుగు డిఆర్‌డిఎ మండలం మహిళా సమైక్య ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్న తహశీల్దారు పీవీ కృష్ణారెడ్డి టిడిపి నాయకులు ఎపిఎం వైనుదార్ ప్రారంభించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం అదేవిధంగా వివిధ గ్రామాల నుంచి వచ్చే వారి దృష్టిలో ఉంచుకొని అందరికీ దాహార్తిని తీర్చాలనే సదుద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని నీటిని వృథా చేయకుండా అవసర నిమిత్తం వాడుకోవాలన్నారు. టిడిపి కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభం

ప్రజాశక్తి- సీతారాంపురం : ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం ద్వారా రైతులకు పంటలు లాభదాయకంగా ఉంటాయని ఎపిఎం వైనుదార్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, వెలుగు సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అదేవిధంగా వ్యవసాయ అధికారులు చూపిన మేరకు ఏ కాలంలో ఏయే పంటలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయో అటువంటి పంటలను వేయాలని ఏమన్న సమస్యలుంటే సంబంధిత అధికారులను అడిగి పంటలు వేయాలన్నారు. ప్రస్తుతం రసాయనాలు వాడి పండించిన పంటలు తినడం ద్వారా అనేక వ్యాధుల బారిన పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో వెలుగు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలింతలకు అవగాహన

ప్రజాశక్తి-కావలి : నవజాత శిశు సంరక్షణ, బాలింతల పోషణపై అవగాహన పెంచుకొని ఆరోగ్యంగా ఎదగాలని సామాజిక వేత్త ఎం.మాలకొండా రెడ్డి కోరారు. సమాజంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషకాహారంతో ఆరోగ్యంగా ఉండాలని, 1000 రోజుల సంరక్షణ తెలిపారు. పుల్లారెడ్డి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకా పక్షోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం గురించి ఐ.సి.డి.ఎస్. సూపర్‌వైజర్ సుశీల వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ బి.లక్ష్మి ప్రసన్న, ఎఎన్‌ఎం పి.మంజువాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాలకు ఎంఎల్ఎ హాజరు

ప్రజాశక్తి-కావలి : కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కంచర్ల విశ్వేశ్వరరావు - కృష్ణకుమారి దంపతుల కుమార్తె హర్షిత వివాహం జమ్మలపాలెంలోని ఎస్‌వి గార్డెన్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎంఎల్ఎ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కావలి పట్టణం ముసునూరు 14వ వార్డులో జరిగిన మంద చిన కోటయ్య ఉత్తర క్రియల కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కావలి పట్టణం 7వ వార్డుకు చెందిన టిడిపి కావలి పట్టణ మహిళా కార్యదర్శి పేయల క్రిష్ణ తల్లి కోటమ్మ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కావలి ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి నివాసానికి చేరుకొని కోటమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-విడవలూరు : మండలంలోని దంపూరు గ్రామంలో గడ్డివామి కాలిపోయిన సంఘటనకు సంబంధించి పనల శంకరయ్య అనే రైతుకు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు టిడిపి యువ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి బుధవారం ఆర్థికసాయం అందజేశారు. ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డి, చౌకెర్ల నీటి సంఘం అధ్యక్షులు విజయ రాఘవన్, మండల టిడిపి నాయకుల సమక్షంలో బాధిత రైతుకు ఆర్థిక సహాయం అందజేశారు.

మస్టర్లు ఎక్కువ.. కూలీలు తక్కువ..

ప్రజాశక్తి-విడవలూరు : మండలంలోని జాతీయ ఉపాధి హామీ పథకంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ అండదండలతో ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు పని చూపించకుండా మస్టర్లు మాత్రం నింపుకుంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల అధికారులు చోద్యం చూస్తూ పని చూడకుండ వ్యవహరిస్తూ ఉండటంపై గ్రామస్థుల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నత అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

సాఫీగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కలిగిరి : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. స్థానిక ఎంపిపి ప్రత్యూష అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపిపి మెట్టుకూరు శిరీష రెడ్డి, జెడ్‌పిటిసి పాలూరి మాల్యాద్రి రెడ్డి సర్పంచ్ గాలి దివ్య ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. వీటిపై ప్రజా ప్రతినిధులు పంచాయతీలలో సమస్యలను లేవనెత్తి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపిపి, జడ్పీటీసీలు మాట్లాడుతూ, అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫెడోరా కంపెనీలో క్లీనర్ మృతి

ప్రజాశక్తి-కొవ్వూరు : కొవ్వూరు సందంగుంట వద్ద జాతీయ రహదారి సమీపంలో గల ఫెడోరా కంపెనీలో లారీ క్లీనర్ కరణ్ (32) మృతి చెందాడు. బుధవారం ఉదయం ఆకస్మాత్తుగా వీచిన గాలికి సిమెంట్ లారీ పైన కప్పిన టార్పల్ పట్ట ఎగిరిపోయింది. పట్టపై నిద్రిస్తున్న లారీ క్లీనర్ కరణ్ పట్టతో పాటు ఎగిరిపోయి దూరంగా ఉన్న సిమెంట్ రోడ్డుపై పడ్డాడు. సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడు లారీలో ఫెడోరా కంపెనీకి మెటీరియల్ తీసుకొని వచ్చినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధే అజెండాగా చంద్రబాబు పాలన

ప్రజాశక్తి-కోవూరు

రాష్ట్రంలో అభివృద్ధే అజెండాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన ఉందని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోవూరు గ్రామాభివృద్ధి కోసం రూ.2కోట్లకు పైగా నిధులు వెచ్చించామన్నారు. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె కోవూరు గ్రామానికి విచ్చేయడంతో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆమె రూ.25లక్షల వ్యయంతో నిర్మించిన కైలాసభూమి రోడ్డు ప్రారంభోత్సవం చేశారు. కోనేటి కయ్యలు ప్రాంతంలో 8, 9 వార్డుల్లో పర్యటించిన ఆమె ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను ప్రజలు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కోనేటి కయ్యల ప్రాంతంలో శిథిలావస్థకు చేరిన ఆయుర్వేద ఆసుపత్రి పునర్నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. తుప్పు పట్టి ఉన్న ఇనుప ఎలక్ట్రికల్ స్తంభాల స్థానంలో కొత్తగా

కైలాసభూమిరోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

సిమెంట్ స్తంభాలు వేయిస్తున్నారు. 13యేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న కోవూరు షుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల సమస్యకు త్వరలోనే పరిష్కారం దొరుకుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కోవూరు నియోజకవర్గ రైతులు సహకార కేంద్రాల ద్వారా అత్యధిక ధాన్యం విక్రయించి రికార్డు సృష్టించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్య సేకరణ చేసిన 24గంటలలో అన్నదాతల అకౌంట్లో డబ్బులు వేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో రైతన్నలు సంతోషంగా వున్నారన్నారు. పాఠశాలలు పున:ప్రారంభం అయ్యాక బడికెళ్లే పిల్లలున్న ప్రతి తల్లి అకౌంట్లో తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు జమ చేస్తామన్నారు. వేట విరామం సందర్భంగా మత్స్యకారులకు రూ.20వేల ఆర్థిక సహాయం ప్రకటించి ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కోవూరు పంచాయతీ రాజ్ ఎఇ శ్రీనివాసులు, తహశీల్దార్ నిర్మలానంద బాబా, పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఎంపిపి పార్వతి, టిడిపి మండల అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, స్థానిక నాయకులు గాదిరాజు అశోక్, బాల రవి, పిచ్చుక మధు, తిరుమూరు అశోక్ రెడ్డి, నల్లపరెడ్డి సురేష్ రెడ్డి, జనసేన నాయకులు చప్పిడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పరామర్శ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

విధి నిర్వహణలో మంగళవారం తెల్లవారుజామున బుచ్చిరెడ్డిపాళెం బాంబే రోడ్డు, రాఘవ రెడ్డి కాలనీ వద్ద ప్రమాదానికి గురైన పారిశుధ్య కార్మికులు కర్రా దశరామయ్య, యాదగిరిలను సిఐటియు, సిపిఎం నాయకులు చల్లకొలుసు మల్లికార్జున రావు, పొతంశెట్టి శ్రీనివాసులు, 2వ వార్డు కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్ బుధవారం నెల్లూరు నారాయణ హాస్పిటల్‌కు వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరు ఇరువురికి మెరుగైన చికిత్స అందించాలని నగర పంచాయతీని కోరారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన అధికారులు, పాలకమండలిని అభినందించారు. బాధితులకు వారి ఆరోగ్యం పూర్తిగా మెరుగయ్యే వరకు వారి వైద్యం ఖర్చులు, కుటుంబ పోషణను మున్సిపాలిటీ వారే బరాయించాలని వారు కోరారు. నాయకులవెంట షేక్ మునీర్ అహ్మద్, షేక్ ఖాదర్ భాషాలు వున్నారు.

కార్మికుల చికిత్సకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

పట్టణంలో లారీ ఢీకొని నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నగర పంచాయతి పారిశుధ్య కార్మికులను కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం నారాయణ ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. వైద్యులతో కలిసి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజాతో మాట్లాడి వారికి చికిత్స నిమిత్తం నగదును వారి కుటుంబ సభ్యులకు అందించాలన్నారు. ఆమె సూచనల మేరకు బుచ్చి పట్టణ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా, వైస్ చైర్మన్‌లు యరటపల్లి శివకుమార్ రెడ్డి, నస్రీన్‌ఖాన్‌లతో కలిసి కార్మికుల కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో టంగుటూరు మల్లారెడ్డి, కౌన్సిలర్లు బెలూం మల్లారెడ్డి, చీర్ల ప్రసాద్, షేక్.రహమత్ బాషా, పుట్టా లక్ష్మీకాంతమ్మ, రాచూరి సత్యం, కత్తి నాగరాజు, శ్రీదేవి, కోటంరెడ్డి లలితమ్మ, ఇప్పగుంట సుధాకర్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, షేక్ అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్టం అమలు దారుణం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : వక్ఫ్‌బోర్డు చట్టం అమలు ముస్లిం మైనారిటీలకు చాలా నష్టదాయకమని మండల సిపిఎం కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల ఆస్తులలో హిందువులను సభ్యులుగా చేర్చడం, మతసామరస్యానికి వ్యతిరేకమైందన్నారు. రాజ్యాంగానికి కూడా అది చాలా వ్యతిరేకమైందని, కావున ఈ బిల్లును సవరించి, ఆ చట్టాన్ని రద్దుచేసి 1995వ సంవత్సరంలో విడుదల చేసిన చట్టాన్ని అమలు చేయాలన్నారు. ముస్లిం మైనారిటీ ఆస్తులకు రక్షణ కల్పించాలని ప్రధాన అజెండాతో, నేడు గురువారం ఉదయం 10 గంటలకు దర్గా సెంటర్ నుండి తహశీల్దారు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ పాల్గొంటారన్నారు. మైనారిటీలు, మతసామరస్యాన్ని కోరుకునే ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

పాఠశాలల్లో ఎంఇఒల సందర్శన

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, దుర్గంపల్లి పాఠశాలలో బుధవారం ఎంఇఒలు షేక్ మస్తాన్‌వలీ, తోట శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు దుర్గం పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ జాఫర్ అహ్మద్ తిథి భోజన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ చికెన్ బిర్యానీ, చికెన్ కర్రీ, స్వీట్స్ అరటి పండ్లు, కూల్ డ్రింక్స్ అందజేయడం అద్భుతమన్నారు. విద్యార్థులకు తిథి భోజనం అందించడం ఒక అదృష్టంగా భావించాలని విద్యార్థులకు నాణ్యమైన తిథి భోజనం అందించిన ప్రధానోపాధ్యాయులు షేక్ జాఫర్ అహ్మద్‌ను వారు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సముదాయ చైర్మన్లు వి బాలకేశవులు, మాలకొండయ్య, సహోపాధ్యాయులు వెంకటరెడ్డి, సిఆర్ఎంటిలు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిగ్రామంలోనూ 'ఉపాధి' కల్పించాలి

ప్రజాశక్తి-సీతారాంపురం :

మండలంలో ఉన్న ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఎపిఒ శ్యామల అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కూలీల హాజరు ఆన్లైన్ నమోదు పనుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. మండలంలో ప్రతి గ్రామానికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, లేనిపక్షంలో సంబంధిత గ్రామానికి చెందిన క్షేత్ర సహాయకులకు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరు కూడా తమ వద్దకు వచ్చి తమ గ్రామానికి ఉపాధి హామీ పనులు కల్పించలేదని తనకు సమాచారం అందకూడదన్నారు. అదేవిధంగా ప్రతివారం లేబర్, ఇంప్రూవ్‌మెంట్ చేపట్టకపోతే తగిన చర్యలు తప్పదన్నారు. అటువంటి వారిపై ఉన్నతాధికారులతో నివేదిక పంపడంతో పాటు శాఖపరమైన చర్యలు తప్పు అని హెచ్చరించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో యువతీ యువకులు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ నగేష్ కుమారి బుధవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వయస్సు 21 సంవత్సరం నుండి 50 సంవత్సరాలు లోపు ఉండాలని అభ్యర్థులు పూర్తి వివరాలకు మండల కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

సిపిఎం సభ్యురాలు పద్మమ్మ మృతి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని పేడూరు సిపిఎం శాఖ సభ్యురాలు పాళెపు పద్మమ్మ (51) ఈ నెల 15వ తేదీన మృతి చెందారు. కుటుంబ సభ్యులు బుధవారం పేడూరులో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. పద్మమ్మ అంత్యక్రియలలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముంగళ పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పద్మమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మమ్మ సిపిఎం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆమె ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పద్మమ్మ అంత్యక్రియల్లో సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, బండి శౌరి, మారుబోయిన రాజా, మోచర్ల రాధయ్య, కంది పాటి రమణమ్మ, బొచ్చు వెంకటసుబ్బయ్య, జానకి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

విద్యార్థుల వాట్సాప్ గ్రూపులు ఉండాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

మాట్లాడుతున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

మండలంలోని అన్ని పాఠశాలలలో విద్యార్థుల వాట్సాప్ గ్రూప్‌లను తయారు చేయాలని ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ తెలిపారు. బుధవారం స్థానిక పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల బిసి ఉర్దూ పాఠశాలను ఆయన తనిఖీ చేసిన అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు లైబ్రరీ పుస్తకాలు, నిఘంటువులు ఇచ్చి వారికి పూర్తి అవగాహన కల్పించే విధంగా తగు సూచనలు సలహాలు ఇవ్వాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. 6,7,8 తరగతుల విద్యార్థులకు వేసవి సెలవులలో ఆంగ్లము, గణితం, సైన్స్ పాఠ్యాంశాల పట్ల పూర్తి అవగాహన కల్పించడానికి, హోం వర్క్ వారి సందేహాల నివృత్తి కోసం ప్రతి తరగతి విద్యార్థులకు వాట్సప్ గ్రూపు తయారు చేసి పాఠ్యాంశాల పట్ల పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు తమ క్యాచ్ మెంట్ పరిధిలోని విద్యార్థుల నమోదు కోసం అడ్మిషన్ క్యాంపెన్స్ నిర్వహిస్తూ నాణ్యత గల విద్యను అందిస్తామని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాన్సిషన్లో భాగంగా ప్రమోట్ అయిన విద్యార్థులను కొత్త తరగతి గదులలో కూర్చొని ఇవ్వాలని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరాఫత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8వ వార్డులో 'ఇంటింటికి ఎంఎల్ఎ'

ప్రజాశక్తి-కావలి

సమస్య మీది - పరిష్కారం మాది అంటూ ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి 8వ వార్డులో బుధవారం గడప గడపకు తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ, కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తూ, మిగిలిన సమస్యలను నోట్ చేసుకుంటూ ప్రజల్లో కలిసి నడిచారు. స్థానిక వివేకానంద పార్కులో వ్యాయామ పరికరాలను ప్రారంభించారు. పట్టణంలోని పార్కుల అభివృద్ధిలో దాతలు సహకరించి ముందుకు వచ్చి, అభివృద్ధి చేసేందుకు రావాలని పిలుపునిచ్చారు. 32 పార్కుల సుందరీకరణలో భాగస్వామ్యులైన దాతల పేర్లని పార్కులకు నామకరణం చేస్తామని పిలుపునిచ్చారు. షాదీ మంజిల్ రోడ్డు వద్ద, స్పందన హాల్ వద్ద 2 చోట్ల టిడిపి జెండాలు ఆవిష్కరించారు. రైతు బజార్ వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆయన మాట్లాడుతూ కావలిని కాపుకాస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటానన్నారు. కావలిలో పేద, మధ్య తరగతి ప్రజల జోలికి ఎవరు వచ్చినా చూస్తూ ఊరుకోనన్నారు. కావలి నియోజకవర్గంలో ఇల్లు కట్టుకునే పేదవారు ట్రాక్టర్లలో మట్టి తోలుకుంటున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా టిప్పర్లలో బయట ప్రాంతాలకు మట్టి

సమస్యలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి

తీసుకెళ్లి అమ్ముకోవడం లేదన్నారు. అభివృద్ధి చేసే వారికి అన్ని కార్యక్రమాలు మంచిగానే కనిపిస్తాయని, చెడు పనులు చేసే వారికి అన్ని చెడ్డగా కనిపిస్తాయన్నారు. కావలి అభివృద్ధి తన ప్రధాన అజెండా, కావలిలో రామరాజ్యాన్ని నడిపిస్తామన్నారు. వ్యాపారస్తులు స్వేచ్ఛగా వారి వ్యాపారాలు చేసుకునేలా సహకరిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా బ్లాక్‌మెయిల్ చేసి వ్యాపారస్తులను ఇబ్బంది పెట్టడం లేదన్నారు. వీలైతే అభివృద్ధిలో సహకరించాలి కానీ నోటికొచ్చింది మాట్లాడడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఇరుకైన 8వ వార్డు వీధులన్నీ తిరిగి చూసి, పారిశుధ్యం, డ్రెయిన్లను, కరెంట్ కనెక్షన్లను, తాగునీటి అవసరాలను ఆధునీకరించాలని మున్సిపల్ కమీషనర్, విద్యుత్ ఏ.ఈ. శానిటరీ అధికారులను ఆదేశించారు.

వక్ఫ్‌బిల్లుకు నిరసనగా నేడు ర్యాలీ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ గురువారం సాయంత్రం 4గంటలకు నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు ముస్లిం నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఎస్‌పేట ప్రజల తోపాటు అనుమసముద్రం, గండువారిపల్లి ప్రజలు పెద్దఎత్తున పాల్గొని, నిరసన ర్యాలీను జయప్రదం చేయాలని ఎఎస్‌పేట ముస్లిం సోదరులు పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ దర్గా సెంటర్ నుండి శాంతియుతంగా బయల్దేరి తహశీల్దార్ కార్యాలయం వరకు చేరుకుని, అక్కడ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి గుండెమడకల క్లస్టర్‌కు చెందిన రైతులు 621పొగాకు బేళ్ళను వేలం కేంద్రానికి తీసుకురాగా 482బేళ్ళను పలు కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 124పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్ బి 92,ఎన్ ఎస్ 02ఆర్ఆర్ 07సి ఆర్ 23కాగా అధిక బరువుతో ఉన్న 15బేళ్ళను వేలా నికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.225సగటు ధర రూ.264.69 నమోదు కాగా వేలంలో 11మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాయిరాం ఇంగ్లీష్ మీడియం విద్యాసంస్థల్లో విద్యార్థుల సమక్షంలో పాఠశాలల్లో అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది చేసే విధులను గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ఫైర్‌శాఖ అధికారి పెంచలయ్య మాట్లాడుతూ బహుళ అంతస్తులలో నిర్వహిస్తున్న విద్యాసంస్థలలో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు మెట్ల మార్గంలో తొక్కిడి లేకుండా నిదానంగా రావాలని, లిఫ్ట్‌లో రాకూడదని తెలియజేశారు. ల్యాబ్ లేదా జనరేటర్ రూములో అగ్నిప్రమాదం జరిగినప్పుడు పరికరాలతో ప్రమాదాన్ని ఎలా నివారించవచ్చు వివరించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు నీటి కుంటలలో మునగడం ప్రమాదమని తెలియజేశారు. వరదల సమయంలో ప్రవాహంలో చిక్కుకున్న వారిని

డ్రిల్ చేసి చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లైఫ్‌బాయ్ లైఫ్‌జాకెట్ ఉపయోగించి రక్షిస్తారని తెలిపారు. తీవ్రమైన గాలులలో చెట్లు పడిపోయినప్పుడు పవర్‌సాలతో కట్ చేయడం గూర్చి వివరించారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మలత పిడి, సాయిరాం ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.కె మహబూబ్ బాషా, సిబ్బంది ఎస్‌డి ఖాజా మొహిద్దీన్, ఫైర్‌మెన్స్ ఎస్.కె సంధాని, రాజేష్, వేమారెడ్డి పాల్గొన్నారు.

DISSOLUTION INTIMATION

మంగలపూడి శ్రీధర్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి, చల్లా రాధయ్య తండ్రి నరసింహులు అను మేమిద్దరము పార్టనర్లుగా గల్గిన నెల్లూరుకు చెందిన శ్రద్ధట్రాన్స్‌ఫర్మేషన్ సర్వీసెస్ ఫర్మ్ రిజిష్ట్రేషన్ నెం: 93/2003 అను పార్టనర్‌షిప్ ఫర్మ్ 27-03-2025 న రద్దు (DISSOLVED) కాబడినది. ఈ విషయాన్ని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము.

అకాల వర్షంతో నష్టం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఆరుగాలం పాటు శ్రమించి పండించిన పంట సరిగ్గా కోతకు వచ్చిన సమయంలో కురిసిన అకాల వర్షం అన్న దాత వెన్ను విరిచింది. పలుచోట్ల కోసిన వరి పనలు నీట తడవగా, వీచిన బలమైన గాలి తాకిడికి పంట నేల కొరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పంట దిగుబడి పెరిగింది. ఓవైపు పాతాళానికి పడిన ధరలు గిట్టుబాటు లేక మొదటి రైతు నష్టపోగా, మరో వైపు కురి సిన అకాల వర్షం చివరి రైతులను కుంగదీసింది. ఫలితంగా "దేశానికి వెన్నెముక" అన్నదాత వెన్ను విరిగింది. అన్నదాతల ఆవేదన మేరకు వివరాల్లోకి వెళితే... రబీ సీజన్ను పురస్కరించుకుని మండలంలో దాదాపుగా 20 నుంచి 25 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. ఎకరాకు మూడున్న ర నుంచి 4 పుట్లు పండే పొలాల్లో ఈ ఏడు 4.50 నుంచి 5.50 పుట్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ మేరకు 75 శాతం వరి పంట కోతలు పూర్తయి అమ్మకాలు జరిగి పోయాయి. మరో 25 శాతం వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. నేడో, రేపో కోయాల్సిన సమయంలో దురదృష్టం రైతులను వెంటాడింది. బుధవారం ఉదయం కురిసిన అకాల భారీ వర్షం, వీచిన బలమైన గాలికి అటు కోతకు వచ్చిన పంట, ఇటు అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యం రాశులు పూర్తిగా తడిచిపోయాయి. ఈ పరిణామం అన్నదాతను నిలువునా ముంచేసింది. ప్రభు త్వం ప్రకటించిన మద్దతు ధరలకు ధాన్యం విక్రయాలు జరగక పోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందక 75 శాతం రైతులు నష్ట పోయారు. మిగిలిన 25శాతం వరి పంట కురిసిన అకాల వర్షానికి దెబ్బతినింది. ఏదేమైనా పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించ క 75 శాతం రైతులు నష్టపోయారు. అకాల వర్షం మిగిలిన 25 శాతం అన్నదాతలను నిలువునా ముంచేయడం అ త్యంత విచారకరం.

సురేంద్ర ఎంపిక

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

సురేంద్రను సన్మానిస్తున్న నల్లపరెడ్డి

వైసిపి మండల ఎస్‌టిసెల్ అధ్యక్షులుగా మండలంలోని నర్సాపురం గిరిజన కాలనీకి చెందిన ఎందేటి సురేంద్ర ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సురేంద్రను మాజీ కోవూరు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, సిగినం సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Principal Senior Civil Judge : Nellore

E.P.No. 168 / 2018

O.S.No. 73 / 2016

Sk.Madar Basha - D.H.R

Vs

1. **Sk. Babu**
2. **Sk. Haseena** - J.Drs

వేలం ప్రకటన

పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు జెడిఆర్స్ తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **తే28-04-2025 దిన ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల** లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాట దారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

E.P.SCHEDULE

SPSR Nellore District - Nellore Sub- Registrar - Nellore Municipal Corporation - Nellore Bit-1, Vengala Rao Nagar - N.B.T. Colony - Land in Survey No.1968 under Layout Plan - Plot No.110 an extent consisting of 11 ankanams or 88 sq.yards of site and an extent of 9 1/4 ankanams or 666 sq.yards of RCC Roofed House therein bearing door no.25-1/3116 9 (Near Door No.25-1-2180). **bounded by : East:** Passage **South:** House and site of Noor Ahmed and Abdul Masjeed, **West :** House of Shaik Khadar Basha and Shaik Adamsa, **North:** House and Site of Meera to Some Extent and House of Syed Masthan to Some Extent. An extent of Consisting of 11 ankanams or 88 sq.yards of site and an extent of 9 1/4 ankanams or 666 sq.yards of RCC Roofed House therein Plot No.110, within the above referred boundaries.

DHR Value of	:	**Rs.18,00,000 /-**
Field Assistant Value of	:	**Rs.20,00,000 /-**
Market Value	:	**Rs.17,42,000 /-**

పమిడి ఝాన్సీ, బి.కాం., ఎం.ఎల్.,
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.
సెల్: **94401 22014**

టిడిపి నేతల సమావేశం

ప్రజాశక్తి-దగదర్తి

స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట మండల టిడిపి కార్యకర్తలతో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. చంద్రబాబు జన్మదిన సందర్భంగా మండల కేంద్రమైన దగదర్తిలో మెగా రక్తదాన శిబిరం, భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలో పుట్టినరోజు వేడుకలను 20వ తేదీ ఘనంగా నిర్వహించాలంటూ సూచించారు. అంతేగాక పుట్టినరోజు సందర్భంగా పేదలకు వీలైనంత సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు హనుమంతరావు, జలదంకి శ్రీహరి, చల్లా శ్రీహరి, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువాల వితరణ

ప్రజాశక్తి బిట్రగుంట

బీరువాలు అందజేస్తున్న దాతలు

పాతబిట్రగుంటలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం నెల్లూరు ప్రగతి లైన్స్ క్లబ్ చైర్మన్ డిఎన్ కుమార్ తన సొంత నిధులతో పాఠశాలకు 2 బీరువాలు, 50 కుర్చీలు వితరణ చేశారు. వాకా మహేశ్వరరెడ్డి 10 కుర్చీలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకారావు వారి సేవా కార్యక్రమాలను ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ప్రగతి లైన్స్ సభ్యులు సుబ్బారావు, గుప్తా పాల్గొని మాట్లాడుతూ సరస్వతి నమస్తుభ్యం కమిటీ చైర్మన్ శ్రీ ప్రసాదరావు వారి సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ తాత మదన్, కోఆప్షన్ సభ్యులు వాక మహేష్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.